# ముక్కాని

మధ్యాహ్నం నిద్రలేచిన కామేశ్వరి బద్ధకంగా లేచి ఆవులిస్తూ మధ్యహాల్లోకొచ్చింది

తోడికోడలు సరస్వతి తన నాల్గవ తరగతి చదువుతున్న కొడుక్కు లెఖ్ఖలు నేర్పుతోంది.

"హోంవర్కు పూర్తిగా చేస్తేనే ఈ సాయంత్రం నిన్ను ఆటలకు వదిలేది."

అని తల్లి బెదరిస్తోంటే,

"చేసేస్తానమ్మా"

అని బుద్ధిగా ఒప్పుకుంటున్నాడు కృష్ణ.

ఈ దృశ్యాన్ని చూస్తూ కామేశ్వరి మూతి మూడు వంకరలు త్రిప్పినట్లుగాని, అసలు ఆమె అక్కడకు వచ్చినట్లుగానీ, గమనించనే లేదు సరస్వతి.

"నాలుగో క్లాసు వెధవని పట్టుకొని పెద్ద ఐయ్యేయస్ పరీక్షలకు తయారు చేస్తూన్నట్లు తాపత్రయ పడిపోతున్నావేమిటి సరస్వతీ ? ఈరోజే క్రొత్తసినిమా రిలీజైంది. టిక్కెట్లకు ప్యూన్‌ని పంపించాను, తర్వగా తయారుకా. "

వింతగా చూచింది సరస్వతి తోడికోడలిని.

"పిల్లలకి పరీక్షలు దగ్గరకొచ్చాయి గదా అక్కా? సినిమాలు ఎప్పుడూ వుంటాయి. నువ్వు కూడ ఆరవ చదువు సంధ్యలు కాస్త చూద్దూ, వాడు నా మాట ఖాతరు చేయడంలేదు."

"వాళ్ళ మొహం, నా కొడుకు అయిదో తరగతి, నీకొడుకు నాలుగో తరగతి, కుఱ్ఱ వెధవల పరీక్షలూ ఓ లెక్కేనా పద, సినిమా వచ్చిననాడే చూడాలి నేను. "

"వద్దు మనం వెళ్ళిపోతే వాళ్ళసలు చదవరు. నా మాట వినక్కా."

"ఏడిశారు, పోనీ వాళ్ళనూ తీసుకుపోదాం."

"పరీక్ష లైనాక తీసుకెళ్తే వాళ్ళు సంతోషం, ఇప్పుడెందుకు ? పై చదువులకు ఈ చదువేగా పునాది? "

"ఏమిటో సరస్వతీ నీ ఛాదస్తం. ఓ మూడు గంటల్లో ఇంతోటి బోడి చదువూ పాడయ్యేదేమిటి ? పద్దూ"

"సారీ, నేనురాలే నక్కా, ఇలాగైతే చదువేకాదు, బుద్ధులు కూడా పాడౌతాయి. జీవితానికి చదువుముఖ్యం అని వాళ్ళకిప్పటి నుంచీ తెలియాలి."

"సరే, నేను వెళ్తున్నాను. కానీ సరస్వతీ ఒకమాట.... నీకు జీవితాన్ని అనుభవించడంరాదు, సుఖపడడంరాదు. పిల్లాడి దగ్గర ఎప్పుడూ నువ్వే పంతులమ్మకి మల్లే సతమత మౌతూంటే ఇక అంతంత డబ్బు తగలేసి స్కూలుకు పంపడం దేనికి?"

ఈ సవాలుకు సరస్వతి జవాబియ్యలేదు.

ఈ వాదోప వాదాలన్నీ రవి. కృష్ణా కళ్ళప్పగించిచూస్తూ వింటూనే వున్నారు.

తల్లి అలా సినిమాకు వెళ్ళగానే రవి ఇలా స్నేహితులతో బయటకు వెళ్ళిపోయాడు.

"రవీ, నువ్వూపుస్తకాలు తెచ్చుకో, నేను చెప్తాను" అన్నది సరస్వతి.

"అబ్బ. చదవాలని లేదు పిన్నీ యిపుడు"

అంటూ వెళ్ళిపోయాడు, మళ్ళీతల్లి వచ్చేవేళకు వచ్చేసి బుద్ధిగా యింట్లో వున్నాడు. వాడి జేబులో చాలా డబ్బులు గలగల లాడుతున్నాయి.

సినిమా నుండి వచ్చి అన్నది కామేశ్వరి.

"పిక్చర్ చాలా బాగుంది సరస్వతీ, అది వెళ్ళేలోగా నేను కనీసం మరోనాలుగు సార్లైనా చూడదలచుకున్నాను. ప్చ్, నీకు అదృష్టం లేదు"

కామేశ్వరి మాటలను ఖాతరు చేయలేదు సరస్వతి.

"అబ్బ, నేను వెళ్ళకముందు ఎలా కూర్చున్నారో అక్కడే అలాగే వున్నారు తల్లీకొడుకులు, వెధవ నాలుగో క్లాసు వాడికి యింత చదువా?"

అన్నది కామేశ్వరి అలంకరణ మార్చుతూ.

"నేనూ చదువుకోవాలనుకున్నాను కానీ తలనొప్పిగా వుందమ్మా, పడుకుని ఇపుడే లేచాను."

అంటూన్న రవిని సరస్వతీ కృష్ణా నివ్వెరపాటుతో చూచారు.

"పోన్లే బాబూ. రేపు చదువుకుందుగాలే, ఇప్పట్నుంచీ అంత శ్రమపడిపోవాల్సిన ఖర్మేమీ లేదు నీకు, మీ నాన్న పెద్ద ఆఫీసరు, నేను లక్షల కట్నం తెచ్చాను. వాటికి వారసుడివిరా నువ్వు !"

తల్లి మాటలకు గర్వపడుతూ, సరస్వతి వైపుఒక నిర్లక్ష్యపు చూపు విసిరాడు రవి ఠీవిగా.

రవి చెప్పేది ఘోరమైన అబద్ధమని తోడికోడలితో చెప్పే సాహసం లేకపోయింది సరస్వతికి.

ఆ మధ్య రవి పాఠశాల పనిజేసే సమయంలో సినిమా హాలులో కన్పించాడనీ, సిగరెట్ పీల్చుతున్నాడనీ స్వయంగా చూచిన బంధువులెవరో హితవుకోరి చెబితే, కామేశ్వరి నానా హంగామా చేసి ఆ బంధువులతో తెగత్రెంపులే చేసుకొన్నది. ఇంట జరిగిన రభస కూడా తక్కువేమీకాదు.

భోజనానంతరం కామేశ్వరి భర్తతో కాస్సేపు మాట్లాడుతూ కూర్చుని, తర్వాత ఇద్దరూ పడకగదిలోకి వెళ్ళిపోయారు. అజంట మరలా బయటకు వచ్చేది మర్నాడుదయం ఎనిమిది గంటలకేనని బాగా తెలిసిన రవి పనివాడితో పేకాటలో పడ్డాడు వరండా మీద కూర్చుని.

ఆరికపూడి (కోడూరి) కౌసల్యాదేవి

మర్నాడుదయం టేబుల్ దగ్గర ఉపాహారం తీసుకుంటూ రవి ఏడుపుముఖంతో అన్నాడు !

"టీచర్ కొడుతుంది మమ్మీ. నిన్న తలనొప్పి మూలాన నేను హోమ్ వర్కేమీ చెయ్యలేదు."

"ఏడిసింది, మీదేడి ఎవరో తెలియదా? ఇంతటి ఆఫీసర్ల పిల్లలను కొడితే, దానికా ఉద్యోగం చేసే యోగ్యత వుండనిస్తామా యిక ?"

అంటూ భర్తకు ఫర్మాయించింది, "మీ సెక్రటరీని ఒకసారి స్కూలుకు పంపండి. టీచర్‌తో మాట్లాడతాడు."

"నేను వెళ్తానులే అక్కా........"

అంటూన్న సరస్వతిని కసరిపారేసింది.

"ఎందుకూ ? దాని దగ్గరకు మనంతటి వాళ్ళం వెళ్ళడమా ? వేరే పనిపాటా లేదా ఏం ?"

ఇక తర్కించి లాభంలేదని తెలుసును సరస్వతికి.

కృష్ణ చదువూ ప్రవర్తనలను గురించి తెలుసుకోవడానికి సరస్వతికి అపుడపుడు స్కూలుకు స్వయంగా వెళ్ళే అలవాటుంది,

ఈరోజూ పనులన్నీ తెముల్చుకుని, స్కూలుకు వెళ్ళింది.


"ఛ. ఈ తిరుగుళ్ళు నేను తిరగలేను. ఈరోజు క్లబ్బులో క్రొత్త ప్రెసిడెంటు ఎన్నిక జరుగుతుంది. నాకు టైమైంది"

అంటూ వెళ్ళిపోయింది కామేశ్వరి.

సరస్వతికి కృష్ణ విషయంలో అన్నీ సంతృప్తికరమైన రిపోర్ట్సు లభించాయి.

ఆమెకు లోలోన బాధన్పించింది. 'కామేశ్వరి నిర్లక్ష్యం వలన రవి పాడైపోతున్నాడు, తాను రవిక్లాస్ టీచర్‌తో ఏమైనా






మాట్లాడితే ?'

లంచ్ టైమ్ కావడాన టీచర్‌ను స్టాఫ్ రూమ్‌లో కలుసుకున్నది. అంతలోనే టీచర్‌కు ఫోన్ కాల్ రావడంవల్ల సరస్వతి లేచి నిలబడింది, ఆ టీచర్ కోసం, టెలిఫోన్ సందేశం విన్న ఆ ఉపాధ్యాయిని వదనంలో ప్రశాంతత అంతరించింది.

"మా వాడు చదివినా చదవకున్నా నువ్వు మాట్లాడ్డానికి వీల్లేదు" అని మీ యింటి నుంచే రవి తల్లి ఫోన్ చేశారు. పేరెంట్సే యిలావుంటే మేమేం చేయగలం చెప్పండి ? చిన్న ఉద్యోగులం. మీ మాట వినకుంటే ఉద్యోగం వూడుతుందనితెలుసు అదికూడా హెచ్చరించారు మీ తోడికోడలు.

సిగ్గిలిపోయిన సరస్వతి మారుమాట్లాడ లేకపోయింది.

క్రమంగా రవి పూర్తిగా రాత్రులు బయట గడపడమూ, డబ్బు అవసరమైనపుడు మాత్రమే పగలు అప్పుడపుడూ యింటికి రావడమూ మొదలైంది. ఈ విషయం తల్లిదండ్రుల దృష్టికి వచ్చే సరికే అతడు పూర్తిగా అదుపుదాటిపోయాడు. అయినా కామేశ్వరి మనస్తత్వం మారలేదు.

## 2

"ఒరేయ్ పుస్తకాల పురుగూ, మాతో ఏక్స్‌కర్షన్‌కు వస్తావట్రా ?"

అద్దంలో చూచుకుంటూ క్రాప్ మరలామరలా ఎగదువ్వుతూ రవి చేసిన ఆ సంబోధనా, వేసిన ప్రశ్నాక్షరాలను ఉద్దేశించినవి. ఫిజిక్స్ థియరీ చదువుతూన్న కృష్ణ మాట్లాడలేదు. రవి దుడుకుతనమూ, దుర్వర్తనా అలవాటైపోయిన కృష్ణ ఎపుడూ మౌనమే పాటించుతాడు. అది సరస్వతి ఆజ్ఞ.

"సెలవుల్లో కూడ అంత చదువేమిట్రోయ్ తెలివి తక్కువ వాడా ? మా ఫ్రెండ్సంతా నిన్ను ఆడదానిగా జమ కట్టేస్తున్నారు తెలుసా ?"

అటుప్రక్క వరండాలో తన స్నేహితురాండ్రతో పేకాటలో నిమగ్నమై వున్న కామేశ్వరికి అన్నీ వినిపించుతూన్నాయి. కొడుకును మందలించకపోగా, శ్లాఘించిప్రోత్సహించుతూన్నట్లు మాట్లాడింది.

"నీకెంత కావాలో తీసుకెళ్ళరా, ఓ వెయ్యిచాలా ? ఇంకా కావాలా రవీ ?"

"వెధవ వెయ్యా ? నాలుగు వేలైనా కావాలి మమ్మీ."

"తీసుకెళ్ళరా బాబూ, అంతా నీకుగా కుండే యింకెవరికి ? అందరూ నీలా ఎలా ఖర్చుపెట్టగలరు ? తాహతు వుండొద్దూ?"

వంట చేస్తూన్న సరస్వతి ఈ మాటలు వెన్నుచరిచాయి. చేతిలో పని వదలి హాల్లోకి వచ్చింది.

కృష్ణ చిన్నబోయిన వదనం ఆ తల్లి మనసును కలచి వేసింది.

"నీ వంటి తల్లులుండడం వల్లనే సంఘంలో ఆకతాయి తనమూ, అనవసర అలజడులూ పెరిగిపోతున్నాయి అక్కా, ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చేది పరీక్షలకు బాగా చదువుకోమనిగానీ వినోదంగా తిరగమని కాదు. మూడేళ్ళ నుండీ పదవ తరగతి ప్యాసుకాలేకున్న నీ కొడుక్కి అది తెలియకపోయినా నీకైనా తెలియదనుకోనా ? కృష్ణ ఇంటర్ పరీక్షలు వ్రాయడానికి పది రోజులే వున్నదని తెలియదా ?"

కామేశ్వరి అహం దెబ్బతిన్నది. పేకాట ఆగిపోయింది. సాటిస్త్రీలు, తన స్నేహితురాండ్రూ అంతా వింటున్నారనే అవమానం ఆమె ముక్కుపుటాలను ఎగిరించింది !

"ఏమిటి వాగుతున్నావు సరస్వతీ ? నాకు చదువు విలువ తెలియదూ ? ఔనుమరి. నాకేం నీలా నలుగురు పిల్లలులేరు. అంతా ఆ ఒక్కడిదే, మహారాజులా అనుభవిస్తాడు, చచ్చిచచ్చి రాత్రింబవళ్ళూ చదివి, డిగ్రీ ఒకచేతా పొట్టమరొకచేతా పట్టుకొని దేశంమీద పడి ఉద్యోగానికి ముష్టిఎత్తనవసరం లేదు."

అన్నది నారలు జాపుతూ శివమెత్తిపోయి.

సరస్వతి యిప్పటికీ సహనం కోల్పోలేదు.

"అంతంత కక్షలతో అలుసుగా మాట్లాడుకో కూడదు అక్కా, మనం ఒక ఇంట్లో బ్రతకవలసిన వాళ్ళం, నిత్యంముఖాలు చూచుకోవలసిన వాళ్ళం, ఒకరి బాగు ఒకరం కోరుతున్నాం కానీ ఓగుకాదు."

"అహహా ఏం తీపి ఏంతీపి ? ఒక ఇంట్లో బ్రతకాలనే శాసనం ఏమీలేదు మాటామాటా కలియకుండా మడి గట్టుక్కూర్చునే వాళ్ళతో నాకూ రవికీ అడుగడుగునా కష్టంగానే వుంది. వేర్లు పడడమే మంచిది ! ఆయన క్యాంపు వెళ్ళిరాగానే మాట్లాడతాను."

"అక్కా !"

అంతకంటె మాట్లాడలేక నివ్వెరపాటుతో నిలబడిపోయింది సరస్వతి.

ఆమె కనుల నుండి స్రవిస్తూన్న అశ్రుధారలను ఒత్తడానికి గబగబా లేచివచ్చాడు కృష్ణ.

"అమ్మా, ఏడవకమ్మా, ప్లీజ్."

సినిమా హీరోలా తయారైన రవి కృష్ణవైపు హేళనగా చూస్తూ, చేతిలో నువ్వైన మూలకు విసిరేసి, సంతోషంగా ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

వెళ్తూ వెళ్తూ గుమ్మం దగ్గర ఆగాడు.

"ఒరేయ్ కృష్ణా, పుస్తకం వదిలేశావే మిత్రాపురుగూ, టైమ్ వృధా అయిపోతోంది. చదువు చదువు. జడ్జిపదవులూ, మంత్రిపదవులూ అన్నీ ఎదురు చూస్తున్నాయిరా బుజ్జినాయనా




నువ్వెప్పుడు వస్తావా అని."

కృష్ణా, సరస్వతీ చిన్నబుచ్చుకొన్న ముఖాలతో చూస్తుండగా రవి కామేశ్వరి పకపకా నవ్వేసుకున్నారు. వరండాలో కూర్చుని వినోదాన్ననుభవిస్తున్న కామేశ్వరి స్నేహితురాండ్రు కూడ శృతి కలిపారు.

అదే సమయంలో రామారావు ఆఫీసు నుంచి ఇంటికి రావడం జరిగింది. దృశ్యం ఏ విషయానికి సంబంధించినదో అర్థంకాక చూస్తూండిపోయాడు అతను గతప వద్దనే.

భర్తను చూడగానే సరస్వతికి జ్ఞాపకం వచ్చింది. బావగారు వెంకట్రావు కూడ ఇంట్లోనే వున్నట్టూ, క్యాంపు వెళ్ళడానికి గదిలో బట్టలు సర్దుకుంటూన్నట్టూ భార్యా పుత్రులు చేస్తూన్న ఆగడం వింటూ కూడ అతడు అంత నిర్లక్ష్య వైఖరిలో నిమ్మకు నీరెత్తి నట్లుండటం గమనించిన సరస్వతిలో మరి సహనం మిగలలేదు.

"అక్కా, అదుగో మీ మరదిగారు వచ్చారు. గదిలో బావ గారూ వింటూనే వున్నారు. అయినా మాట్లాడనేలేదంటే నీ అమూ ల్యాభిప్రాయం ఆయనకూ ఇష్టమే నన్నమాట! మనిషికి మనిషి సాయం వుంటుందనీ, కష్టంలోనూ సుఖంలోనూ ఒకరి కొకరు చేయూతగా నిలుస్తారనీ పెద్దలు ఉమ్మడి కుటుంబాలను సాగించారు, ప్రోత్సహించారు, అదేకరమై ఆనాడి కానాడు మన స్వార్థలూ, గృహ కల్లోలాలూ రేగే ఇలాంటి యింట ఆ వ్యవస్థ అవమానం పాలౌతుంది. నువ్వన్నట్టే మనం వేరుగా వుందాం!"

అతి అణకువగల సరస్వతే యిలా మాట్లాడగలదని ఎవరూ ఊహించనందున ఎవరికి వారే కొంత తడవు అవాక్కుగా నిలబడి పోయారు.

"సరస్వతీ, ఏమిటా తొందర?......"

"ఇంకా ఏదో అనబోయిన భర్త రామారావును మృదు వచ నాలతోనే వారించింది సరస్వతి. "నిర్ణయం అయిపోయింది, మీరు వేరేయింటి ఏర్పాటు చూడండి, తలిదండ్రులం మనమిద్దరం బ్రతి కుండీ కృష్ణ పరాయి యింట పొట్ట పట్టుకు పడటం న్యాయం కాదు, వాడిని ఇంకా బాధపెట్టేహక్కు మనకులేదు, ఎవరు ఎంత ధనవం తులో వింటూ అహరహం ఈ యింట చాకిరి చేయవలసిన అగత్యమూ నాకులేదు, మీరేమీ మాట్లాడ వద్దనీ, నా నిర్ణయానికి బలం యిమ్మనీ జీవితంలో మొదటిసారిగా అడుగు తున్నాను."

## 3

పనంతా ముగించుకొని, తాను శుభ్రంగా తయారై పతిరాక కోసం ఎదురు చూస్తోంది సరస్వతి. ఆమె ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా వున్నవి.

రామారావుని చూస్తూనే చిన్నపిల్లలు అతిసంతోషంగా "నాన్న రొచ్చారమ్మ" అని కేకలు పెట్టారు.

రామారావు ముఖం చాలా ఆందోళనగా వున్నది. పిల్లల సంతోషాన్ని గమనించే స్థితిలో లేడతడు, "సరస్వతీ, ఎంత దారుణం జరిగిందో విన్నావా? మావదిన నిద్రపోతున్న సమయంలో చేతికందిన నగలూ, డబ్బూ పట్టుకు పారిపోయాడట వంటవాడు..."

"అదలా వుంచండి, ముందు మనయింటి విషయాలు మాట్లా డండి. మన పెద్దబ్బాయి కృష్ణ ఇంటర్మీడియట్ పరీక్ష ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. పేపర్‌లో రిజల్ట్సు చూడలేదా మీరు?"

"అలాగా?"

రామారావు ముఖం విప్పారింది.

"నిజంగా?బాగా చూశావా నంబరు? ఏడీ కృష్ణబాబు?"

ఆనందంగా ప్రశ్నమీద ప్రశ్న విసిరేశాడు.

"బాగా చూడ్డమేమిటి? అదుగో పేపర్ మీరేచూడండి. కృష్ణ స్నేహితులతో సినిమాకు వెళ్ళాడు"

కృష్ణ ఎప్పుడూ బాగానే చదువుతాడు."

"అంతేకాని నా గొప్ప ఏమీ లేదంటారు?"

కినుకగా అంటున్న సరస్వతిని చూచి నిర్మలంగా నవ్వే శాడు రామారావు.

"ఆమాట నే నెలా అనగలను సరస్వతీ? గొప్ప ఐశ్వర్యాలు లేకున్నా, ఈ యింటినీ పిల్లలనూ యింత నిర్మలంగా దివ్యంగా కట్టడిగా వుంచగల నువ్వు వున్నావు గనుకనే నేనింత నిశ్చింతగా బ్రతక గల్గుతున్నాను. అంతటి సంపదలున్నా అన్నయ్య ఇల్లు ఏమిటోగా వుంది. అన్నయ్య ఎక్కడకో క్యాంపు వెళ్ళాడట; ఆ రవిగాడు ఎక్కడ తిరుగుతున్నాడో నెల్లాళ్ళ నుండీ తెలియదట, ఈ అదను చూచుకొని వంటవాడు యింత తెగించాడు."

"రవి నెల్లాళ నుంచి లేడా?"

"ఆఁ టెన్త్‌క్లాస్ పరీక్ష నాల్గవసారి వ్రాయడానికి కూర్చున్నా డుగా? కాపీకొట్టి పట్టుబడి మూడు సంవత్సరాలు డిబారయ్యాట్ట. తండ్రి కోప్పడితే ఇల్లొదిలి పోయాడట, ఇప్పుడక్కడి నుండే వస్తు న్నాను. పోలీస్ రిపోర్టిచ్చింది వదిన, ఇంటి నిండా పోలీసులూ, గొడవా, పద చూసివద్దాం"

సరస్వతి వదనం గంభీరంగా మారిపోయింది.

"ఏమండీ? నేనుండి చాకిరి చేసినంత కాలం ఆ యింట వంటమనిషి అవసరం కలిగిందా? ఓ చీపురు పుల్ల అయినా దొంగ తనం జరిగిందా?"

"లేదు. నీలాగ ఒళ్ళు వంగితే ఆ విడకు ఇక యింతగొడవ దేనికి? ఒక్క పిల్లాడికి, భర్తకూ వండిపెట్టి ఆలన చూచుకోలేనంత సుకుమారి! ఆవిడ క్షేమసమాచారాలు ఎలావున్నా మనం వెళ్ళి చూడడం ధర్మం కదా?" సరస్వతి ఉదాసీనంగా అన్నది!

"చూడండి, స్వగృహం, స్వజన పాలనా బాధ్యతలూ

ముందు ముఖ్యం ఎవరికైనా, తల్లిఎంతో జాగ్రత్త వహిస్తే తప్ప, ఈ రోజులలో పిల్లలు తప్పుదారులు పట్టడానికి అనేక త్రోవలున్నాయి. కృష్ణ వచ్చేదైమైంది. మీరూ యారవ్వండి. అందరం కలిసి ముందు కృష్ణ చదివిన హైస్కూలుకు వెళ్ళి ఈ విషయం ఆ టీచర్లకు చెప్పిరావాలి. ఇంటనేనూ, స్కూల్లోవారూ చేసినకృషికి ఫలితమే కృష్ణ ఉత్తమ విద్యార్థి అవడాని కారణం."

"నిజమే."

సరస్వతి యిచ్చిన మిఠాయిలు అందుకుంటూ స్కూలు టీచర్స్ చాలా సంతోషం వ్యక్తపరచారు

"ఇదంతా మీ చలవేనండి, పిల్లవాడికి మంచి శిక్షణా, సరైనదారీ చూపారు మీరు, అందుకే అప్పుడు పదవతరగతీ. ఇపుడు ఇంటర్మీడియేట్ కూడా ప్రథమ శ్రేణిలో వచ్చాడు."

అంటూ కృతజ్ఞతలు చెప్పుకొన్నారు భార్యా భర్తలిద్దరూ ఉపాధ్యాయులకు.

ఒక ఉపాధ్యాయిని మందహాసం బదులిచ్చింది!

"మేము యిచ్చే శిక్షణకు తలిదండ్రుల సహకారం కూడ వున్నపుడే కదండీ మంచిఫలితం కలిగే? కేవలం మా శిక్షణ వల్లనే అయితే ఇక్కడ చదివే ప్రతి ఒక్క విద్యార్థీ మా సంస్థకూ తన యింటికీ కూడ పేరు ఆర్జించ గలిగేవాడు"

మరొక ఉపాధ్యాయిని ఆ మాటను బలపరచింది.

"ఇక భవనం పటిష్ఠత దాని పునాదిపై ఆధారపడి వున్నట్లు ఒక విద్యార్థి ప్రవర్తన, వికాసం అతడి గృహ వాతావరణంపై ఆధార పడతాయంటాను నేను, పిల్లవాడికి ప్రథమ శిక్షకురాలు తల్లి. కృష్ణ భవిష్యత్తుకై ఓపికగా కృషి చేస్తూన్న మీకు మా అభినందనలు!"

తిరిగి వచ్చేదారిలో రామారావు అన్నాడు.

"మరి నా అభినందనలు కూడా తీసుకో సరస్వతీ. టీచర్స్ మాట అక్షరాలా నిజం కృష్ణ చదువునూ ప్రవర్తననూ ఎప్పుడూ ఒక కంట కనిపెట్టి అజమాయిషీ చేసేది నువ్వేగా? ఆఫీసు, డబ్బు తేవడం మినహా మా మగవాళ్ళకు బాధ్యత లేముంటాయి!"

సరస్వతి మానసికోల్లాసానికి అవధుల్లేవు.

ఏ స్త్రీకైనా యింతకు మించిన సన్మాన మేముంటుంది?

## 4

అనుకోకుండా వచ్చిన తోడి కోడలినీ పిల్లలనూ చూచి అయిష్టంగా ముఖం త్రిప్పుకొన్నది కామేశ్వరి. సరకు చేయలేదు సరస్వతి.

"కృష్ణ పైచదువులకు వెళ్తున్నాడక్కా. పరాయిదేశం వెళ్ళే ముందు మీఆశీర్వాదం తీసుకోవడానికి తీసుకొచ్చాను."

వచ్చీరాని వంటతో సతమత మౌతూన్న కామేశ్వరి చేతిలోని పాత్రను పెద్ద శబ్దంతో ప్రక్కన పడేసి ఇటు తిరిగింది విసుగ్గా.

వచ్చినవారినికూర్చోమన్న ఆదరణ ఆప్యాయతా లోపింపగా, మాటలు కూడ బాధాకరమైనవే విన్పించింది.

''పంపాలంటే విదేశాలు పంపుకోవమ్మా, ఎవడిక్కావాలి ఇక్కడ ఈ గొడవలు? వంటవాడు మానేశాడు, నానా అవస్థగా వుంది.''

సరస్వతి నిర్ఘాంతపోయినా, నిరసనకు ప్రతి నిరసనను విన్పించలేదు; సౌమ్యతను వదలలేదు.

"అక్కా, వాడు వెళ్ళడానికి పెద్దలైన నువ్వూ, బావగారూ........"

"ఆపు సరస్వతీ, ఈ నాటకాలన్నీ నా కొద్దు, ఒకేమాట ఖండితంగా చెబుతున్నాను విను. తెల్లారిలేస్తే రకరకాలుగా అడుక్కొనే వాళ్ల ఎక్కువైపోయారు. ఎవరి శక్తికి సరిపడిన బ్రతుకు వాళ్ళు బ్రతకాలిగానీ మే మెంతకని సాయం చేస్తాం? మమ్మల్ని మమ్మల్ని అడుక్కొని స్టేట్స్‌కు వెళ్ళకపోతే లోటేమీ లేదు కానీ ఆ చదివిన ఎమ్మెస్సీ డిగ్రీతో ఇక్కడే ఏదో ఓ నౌకరీ చూచుకోమను, నీ కొడుకును విదేశాలకు పంపడానికే నే నిక్కడ ధనపురాసులు పోగు చేసుకూర్చున్నా ననుకొని వచ్చావా?"

ఈ ఈసడింపుకు చెప్పుదెబ్బవంటి సమాధానం వచ్చింది కృష్ణనుండి.

"మీరూ మీరూ దానం యిస్తే తీసుకొనేంత హీనస్థితి కాదు పెద్దమ్మా మాది, నీ ఆశీర్వాదం తీసుకోడం 'అవసరం' అని అమ్మ చెప్పి బలవంతంగా తీసుకొచ్చింది. అంతే, నాకు స్కాలర్‌షిప్ వచ్చింది తెలుసా?"

కామేశ్వరి ముఖం రంగులు మారాయి. అక్కసునూ, అసూయనూ మరింత విరస ధోరణిలో వ్యక్తీకరించింది.

"వెళ్ళరా వెళ్ళు, వెళ్ళకేం జేస్తావు అందర్నీ వదలి? రేపు ఏదో ఓ నౌకరీ చేసుకు బ్రతకాలిగా?"



సరస్వతి కలుగ జేసుకొంది.

"అదేం మాట అక్కా? ఈ రోజుల్లో ఎవరికైనా చదువూ ఉద్యోగం ముఖ్యం కదా?"

కామేశ్వరి బాణం వదలింది—

"మా లాంటి వాళ్ళకా ఖర్మ అవసరం లేదు. నాకు బోలెడు ఆస్తి వుంది సరస్వతీ"

"వుండేది, నాకూ తెలుసు."

"అంటే? ఇప్పుడు లేదనేగా చెప్పుతున్నావు? నా కొడుకు ఆస్తి నంతనూ పాడుజేసాడనేగా ఎత్తి పొడుస్తున్నావు? చూడు సరస్వతీ, వాడెంత ఆస్తి తగలేసినా వర్వాలేదు. వాడికి కనీసం ఎనిమిది లక్షలైనా కట్నం పలుకుతుంది. తెలుసా?"

"చిన్నప్పటినుండీ యిలా మాట్లాడే రవిని పాడుజేసావు. ఇప్పటికైనా నీ ధోరణి మార్చుకో అక్కా. వెళ్తున్నాను."

## 5

"సరస్వతీ, చాలా శుభవార్త తెచ్చాను. వింటావా?"

కోచావికి కూర్చుంటూ అన్నాడు రామారావు.

చాలా ఆనందంగా వున్నది అతడి ధోరణి.

"చెప్పండి. అంతకంటే ఆనందమా?"

కర్తకు వడ్డించి, వీవన విసురుతూ చేసవలోనే కూర్చున్నది సరస్వతి.

"పెద్దబ్బాయి ఉత్తరం రాకాదేమో? ఔనా" అనడిగింది తానే మరలా.

"ఔను, కాని మామూలు ఉత్తరం కాదు. అన్నీ విశేషాలే!"

"త్వరగా వెయిదురూ అట్టే ఊరించక, ఆరోగ్యం బాగా చూచుకోమని రాయండి జవాబులో."

"అదింత యిక మనకు లేదు, ఆరోగ్యం బాగా చూచేవారూ వస్తున్నారు. ఉద్యోగం పర్మనెంటూ అయ్యింది."

సరస్వతి కనులు విప్పారాయి.

"ఏమిటి? ఏమన్నా వేషాలు మొదలు పెట్టాడా?"

"అబ్బ. అనుద్ది పోనిచ్చుకున్నావు కాదు, నీ కొడుకు ఆణి ముత్యం అని మరిచిపోతూనే మళ్ళీ అనుమానాలు!"

"మరేమిటో!"

"అక్కడ మన కృష్ణ చాలా మంచి పేరు తెచ్చుకున్నాడట. ఉద్యోగంలో బాగా పైపైకి వెళ్తాడనడానికి ఏమీ అనుమానం లేదట, అక్కడ నా స్నేహితుడు వెంకట్రామయ్య లేడూ? అతను రాశాడు.

వడ్డన మరచిపోయింది సరస్వతి అతి సంతోషంతో.

"త్వరగా చెప్పండి, ఇంకా ఏం రాశారు?"

"ఇప్పుడు నెల జీతం పదిహేను వందలట, కృష్ణపై సీనియర్ ఆఫీసర్‌కు కూడా చాలా అభిమానమట. వాళ్ళకి ఎమ్మే చదువుతున్న అమ్మాయి వుందట, కృష్ణకు యివ్వాలని మహా కోరికగా వుందట, వెంకట్రామయ్యను రాయబారం చేయమన్నారట."

"పెద్ద ఆఫీసర్‌గారమ్మాయి, అందునా ఎమ్మే చదివిన అమ్మాయిని మన కృష్ణకు ఇస్తారా?"

ఆశ్చర్యంతో బుగ్గన వ్రేళ్ళుంచుకుని అలా భర్తవైపు చూస్తూండిపోయింది సరస్వతి.

రామారావు పకపకా నవ్వాడు.

"ఏమిటి మరీ అంతమైమరపు? ఎంగిలి చేయి చెంపన వ్రాసుకున్నావు చూచుకో."

"పోనీండి కాని ఆశ్చర్యం కాదూ? మనమెక్కడ పెద్ద ఆఫీసరెక్కడ? నిజమేనా అని!"

"ఏం? మన కృష్ణ ప్రవర్తనా చదువూ తక్కువవా మరి? మనం ఐశ్వర్యవంతులంకాదనేది నీ సమస్య, ఈ రోజుల్లో తెలివైన తలిదండ్రులు తెలివైన పిల్లవాడి గుణగణాలూ ఉద్యోగస్థాయీ మాత్రమే చూచుకుంటారు. అనుమానమైతేనా షర్టుజేబులో ఉత్తరం వుంది చూడు, గొప్పధనవంతులం కాకున్నా సాంప్రదాయకమైన కుటుంబ వాళ్ళం మనమని మరువకు."

ఒక్క విదుగున వెళ్ళివంకిన వ్రేలాడుతూన్న షర్టుజేబునుండి ఉత్తరం తీసుకుంది సరస్వతి.

"అబ్బో ఫోటో కూడా పంపారు! చక్కగా వుందండీ అమ్మాయి."


గబగబా ఉత్తరం చదివేసింది సరస్వతి.

"మంచిరోజు చూచుకొని పెండ్లి చూపులకు రమ్మని రాశారండీ."

"అదేమరి, ఏమంటావు?"

"ఇంకేముంది? మన కృష్ణ అదృష్టవంతుడండీ, వాడిని






కాస్తకొప్పడితే రాచిరంపాన పెట్టేస్తున్నా ు పిల్లాడిని. మరీ అంత చదువు యావ ఏమిటి ? అని కసరుకొనే ారు మీరు. చూశారా ? నేనలా వాడికి తర్ఫీదు యివ్వబట్టే గదా ఈనాడింత పూలబాటలా వుంది కృష్ణ జీవితం ? ఇంకా మొన్న మొన్నటిలా వుంది అంతా. వాడు విదేశాలు వెళ్తుంటే ఎంత ఏడ్చానో ! చదువు పూర్తై స్వదేశం రావడమూ, ఉద్యోగమూ అన్నీ కలలావున్నాయండీ."

భోజనం ముగించి లేచిన రామారావు అప్యాయంగా, సస్నేహంగా, సగౌరవంగా చూచాడు భార్యవైపు.

"నిజమే సరస్వతీ, అంగీకరిస్తాను. నీవంటి తల్లి వుండడమే మన కృష్ణ అదృష్టం. ఈ రోజులలో ఎందరో పిల్లల్ని గురించి ఎన్నో వింటున్నాం. అంతా శిక్షణాలో పంవల్లనే ననడానికి మా అన్నయ్య కొడుకు రవి నిదర్శనం."

"పోనివ్వండి, మనవెందుకు అనుకోవడం వాళ్ళ గురించి ? ఇంతకూ కృష్ణ అభిప్రాయం తీసుకోకుండా మనం వెళ్ళేదెలాగ ?"

చిన్నగా నవ్వాడు రామారావు.

"ఆ లాంఛనాలన్నీ అయినాకనే వెంకట్రామయ్య ఉత్తరం రాశాడనుకుంటాను. మధ్యాహ్నం కృష్ణ ట్రంక్‌కాల్ చేసినాతో మాట్లాడాడు ఆఫీసుకు."

"చెప్పరేం మరీ ?"

"ఈ విషయం అసలు మాట్లాడలేదనుకో, మనరెండో వాడికి అక్కడ ఏదో ఉద్యోగం చూశానని తీసుకురమ్మనీ మాత్రం అన్నాడు, 'అమ్మని కూడా తీసుకురండి చూడాలనుంది' అన్నాడు, అంతేమరి......"

భార్యా భర్త లిరువురూ మనస్ఫూర్తిగా నవ్వేసుకున్నారు.

"కృష్ణ మన మీద ఇంత గౌరవం వుంచాడు. తన తర్వాతి పిల్లలకు కూడ ఉద్యోగాలు చూస్తున్నాడు : ఆ మాత్రం ఆలోచిస్తున్నాడంటే ఇంకా ఏం కావాలండీ మనకు ?"

"పదపద, ఇహ అత్తగారి పొరున్నావన్నమాట !"

"ఊం. మీరు మామగారూ ఆ తర్వాత తాతగారూ కావడం లేదూ ?"

"అది సరేకానీ ఇటువంటి విశేషం అన్నయ్యకు చెప్పకుండా వెళ్ళడం బాగుండదేమో సరస్వతీ ?"

రెండు క్షణాలు ఆలోచించింది.

"కావొచ్చండి, పెద్దవాళ్ళు గనుక చెప్పడం మన ధర్మం. ఎటొచ్చి ఎటువంటి వికటపు విసుర్లు వినవలసివస్తుందో ననేదే నా భయం."

అనుకోని దృశ్యం కన్పించింది వెంకట్రావు యింట్లో సరస్వతీ రామారావులు అడుగుపెట్టే సరికి.

కామేశ్వరి ఒక మూలన కూర్చుని విపరీతంగా దుఃఖిస్తోంది. వెంకట్రావు ఏమీతోచనివాడిలా పిచ్చిగా అటు యిటు పచార్లు చేస్తున్నాడు.

"ఏంవచ్చార్రా ? ఏం నా ఏడుపును ఆనందంగా చూడాలని వచ్చారా ! అసలు మా ఖర్మయిలా కాలిందని మీకు కబురెవరు అందించారు ?"

కామేశ్వరి రౌద్రంగా అడగడంతో సరస్వతీ, రామారావూ నిర్వేరపాటుతో నిలబడిపోయారు.

"వాళ్ళేం చేశారని వాళ్ళమీద కసరుకోవడం ? మన నిర్వాకం యిలా ఏడ్చిందని మన ఖర్మకు మనం ఏడవాలి."

అని మందలింపుగా అన్నాడు వెంకట్రావు భార్యను.

"అసలేమైందన్నయ్యా ?"

బెదురుతూనే అడిగాడు రామారావు.

"ఏం చెప్పనురా ? ఖర్మ అంతా, మన రవిగాడు ఏదో వెధవ పనిచేసి వైజాగ్ పోలీసులకు పట్టుబడిపోయాడట !"

"ఆఁ !"

సరస్వతి కనుపాపలు కదలికను మరచాయి.

కామేశ్వరి దుఃఖం ఎగిరిపోయి కోపం స్థానం పొందింది.

"దొంగనాచి, తెలియనట్లే నాటకం, నీ కొడుకు వైజాగ్ లోనే ఉద్యోగం వెలగ బెడుతున్నాడుగా ? వాడు రాసి వుంటాడు ఇలా జరిగిందని, మమ్మల్ని హేళన చేయాలని వచ్చావు. నాకు తెలుసు, డబ్బు విసరిపారేస్తాం, విడిపించుకుంటాం పిల్లాడిని, మా కెవరి సలహామర్శలూ అక్కర్లేదు, వెళ్ళు."

సరస్వతి కనుల గిర్రున నీరు తిరిగింది.

"రవి నాకు పరాయివాడా అక్కా సంతోషించటానికి ?"

వెంకట్రావు వైపు చూచాడు రామారావు.

"అన్నయ్యా, ఇక్కడికొచ్చేవరకూ మాకేం తెలియదు. ఈ విశేషం ఇక్కడే విన్నాం, కృష్ణను చూడటానికి వెళుతున్నాం మేము. మీరూ పెద్దరికంగా మాతో వస్తారేమోనని అడగడానికి వచ్చాంగాని, కష్టంలో పరాయివాళ్ళలాగా హేళన చేసే స్వభావం నాకుగానీ సరస్వతికిగానీ వున్నదో లేదో నీకు తెలియదా ?"


దీర్ఘంగా నిట్టూర్చాడు వెంకట్రావు.

"ఆ రాక్షసి స్వభావం నీకేమైనా క్రొత్తటరా తమ్ముడూ ? ఈ పిచ్చి స్వభావంతోనేగా సంసారాన్ని ఈ గతికి తెచ్చింది ? సరస్వతిలాగా నేర్పుగా కొడుకును పెంచుకొంటే కొంపకు ఈనాడీ పొట్లు వచ్చేవా ? వాడిని సర్వభ్రష్టుడిని చేసి వదిలింది."

"ఏమిటీ ?"

శివకాళిలా లేచింది కామేశ్వరి భర్త పైకి.

"నా మీద చాడీలు చెప్తున్నారా ? ఏం మీ నిర్వాకం ఏమై




నట్టూ ? మీరెండుకు పెంచుకో లేదూ కొడుకును బుద్ధిగా ?"

సరస్వతీ రామారావులు ఆ యిరువురికీ సర్దిచెప్పలేక సతమత మయ్యారు.

"అన్నయ్యా మనలో మనం ఘర్షణ పడడంకాదు, రవిని వదలించుకోవడం ప్రధానం యిపుడు."

"ఏం చెప్పనా తమ్ముడూ నాఖర్మ, ఈ వెధవ నేరాలు చేయడం, జైలుకెళ్ళడం మామూలైపోయింది. నేర్పుగా కమ్ముకొస్తున్నాను ఇన్నాళ్ళూ, మొదటిసారి యింట్లో నగలూ డబ్బుపోతే కొడుకు చేసిన పనిదాచి, వంటవాడిని జైల్లో పెట్టించిన మహాయిల్లాలురా ఇది! అంతా చూస్తూవూరుకొన్న నాకు ఈశాస్తి జరగాల్సిందే."

రెండు చేతులతో ముఖం బాదుకుంటూ రోదించాడు.

ఇపుడూ సిగ్గుపడకపోగా, మరింత తీవ్రతతో దిందులు ప్రారంభించింది కామేశ్వరి.

"మీరు మరొక్కమాట అంటే నేను ఊర్కొనేది లేదు. రెండురోజులై తెలిసింది బిడ్డజైల్లో మగ్గుతున్నాడని, అయినా వెళ్ళడానికి ఠికాణాలేక ఇలా అసమర్థుడి లాగా పడుండి ఎదురు నన్ననడం దేనికి? అ పిల్లలనేకం చేస్తారు. కుట్టకనపుడుకు అది. వెనక పెద్దవాళ్ళం వున్నది అవన్నీ క్రమ్ముకొనేందుకే, వెళ్ళి మార్వాడీ దగ్గర ఓ నాల్గువేలు అప్పుపట్రండి, తమ్ముడూ మరదళ్ళతో తర్వాత తైతక్కలాడ వచ్చు.

రామారావు సరస్వతిలు ముఖముఖాలు చూచుకున్నారు.

"అప్పా ? డబ్బు లేదా అన్నయ్యా నీ ఇంట్లో డబ్బులేక పోవడమా ?"

అనడిగిన రామారావును సూటిగా చూడలేక తలవాల్చుకున్నాడు వెంకట్రావు.

"మాట్లాడవేం అన్నయ్యా !"

ఇంకా చూపులు భూమిమీదనే నిలిపి మాట్లాడుతున్నాడు వెంకట్రావు.

"అందరం ఖర్చు చేసేవాళ్ళమే అయితే ఆస్తి ఏం మిగుల్తుందిరా ? ఒక్కసారి పదివేలతో పోయి నెల్లాళ్ళు ఎక్కడెక్కడో తిరిగి వస్తాడు రవి, ఆస్తి అంతా మార్వాడీ తాకట్టులోనే వుంది. ఆ మధ్య నా ఆఫీస్‌మనీ ఇంట్లో వున్నది. యాభైవేలు రొక్కం మాయంజేశాడు రవి, ప్రస్తుతం అదికట్టేవరకూ నన్ను సస్పెన్షన్‌లో వుంచారు !"

"విన్పించండి, విన్పించండి ఇంకా దాడీలు, ఏం కొంపలు మునగలేదు. ఎక్కడో ఓ సంబంధం చూచి రవికు ముడిపెడతాం. ఆ కట్నంతో అన్ని అప్పులూ ఎగిరిపోతాయి. మాకేం పర్వాలేదు గానీ ఈ అనవసర మూకలు ఇకివెళ్తే బాగుంటుంది."

వెంటనే వెంకట్రావు ఒక్క అంగలో భార్యను సమీపించడం, ఆమె చెంప ఛెళ్ళుమన్పించడం జరిగిపోయింది.

సరస్వతికి అంతా అయోమయంగా వుంది.

రామారావు రెప్పపాటులో అన్నను జేరి అడ్డుకొనకపోతే కామేశ్వరిని అతడు యింకా చావగొట్టేవాడే.

"నా తమ్ముడినీ మరదలినీ ఎందుకే అంతంత మాటలంటావు ? వాళ్ళు సానుభూతితో కష్టసుఖాలు అడుగుతున్నారుగానీ నీదేం తినలేదు, తినడంలేదు. మొన్ననీ అన్నవచ్చి ఏమీ అవసరం లేనట్టు వెళ్ళిపోయాడు అంటావిని, వాడికి నా డబ్బు ఎంతెంతదోచి పెట్టావో గుర్తుందా ? అంతాతినితిని ఈనాడేమన్నాడు? 'నీ జులాయి కొడుక్కి నా కూతుర్ని చేయనూ వేరే సంబంధం చూచుకున్నా'నని చెప్పి శుభలేఖ యిచ్చివెళ్ళాడే, అది ఆహ్వానమా చెప్పవేం ? వాడిదగ్గర మొన్న ఏమైంది నీ ప్రతాపం ? నువ్వూ నీ కొడుకూ వచ్చినట్టు వుండకపోయారంటే ఇక వూరుకోను, జాగ్రత్త."

కామేశ్వరి లోనికిపోయి ధభ్భున తలుపులు మూసుకున్నది.

సరస్వతి వెంకట్రావును జాలిగా చూచింది. భర్తకు కనులతోనే ఏదో చెప్పింది. అతడు అర్థం చేసుకున్నాడు.

"అన్నయ్యా, ప్రస్తుతానికి డబ్బుచింత వద్దు. నేను సర్దగలనులే. వైజాగ్‌లో నా స్నేహితుడు పెద్దలాయరు వున్నారు వెంకట్రామయ్య అని, రవి కేసు ఏమిటో అయనకు నువ్వువచ్చి చెప్తావుగానీ, మిగిలినవి నేను చూచుకుంటాను."

"ఎందుకురా ? ఇంతా తంటాలు పడి వదలిస్తే మళ్ళీరేపే ఏ వెధవ పనోచేసి మళ్ళీపోతాడు కటకటాలలోనికి ఇప్పుడు నా ఉద్యోగం నిలబెట్టుకోవడమే నా ప్రధాన సమస్య."

"ఇక దైవమే నిన్ను రక్షించాలన్నయ్యా, ఆడవారికి గౌరవం ఇవ్వడం వేరు, వాళ్ళు ఎంత అహంకారంగా అనుచితంగా ప్రవర్తించినా పట్టించుకోక అసమర్థుడు మూగిగా బ్రతకడం వేరు, అంతా అధ్వాన్నమైనాక ఇక ఇప్పుడు నీ చేయిలేచినా, నోరులేచినా ప్రయోజనం శూన్యం, వెళ్ళొస్తాం. డబ్బున్నవాడిని కాను ధనరూపేణా సాయపడటానికి, మాటసాయానికి మనిషి సాయానికి మాత్రం ఈ తమ్ముడూ మరదలూ ఎప్పుడూ వుంటారని మరువకు."

"నాగోల నాకు మామూలైపోయింది లేలా తమ్ముడూ, మీరెలావున్నారు ? ఈ రాక్షసి మూలాన ఒకే ఊళ్ళోవుండీ ముఖాలు చూచుకో లేకపోతున్నాం, కృష్ణా, మిగిలిన పిల్లలూ బాగున్నారా?"

ఈ ప్రశ్నకు సమాధానాలూ, ప్రస్తుత ప్రయాణవిశేషం విని సంతోషం ప్రకటించాడు వెంకట్రావు.

"ఈ ముఖంతో పెళ్ళి పేరంటాలకెలా రాను తమ్ముడూ ? నా ఆశీర్వాదం ఎప్పుడూ వుంటుంది."

మరదలితో అన్నాడు మరలా !

"నా పెద్దరికం మంట గలసిపోయిందమ్మా, నేను రాలేను. చిన్నదానవైనా నీకు చేతులెత్తి దణ్ణం పెడతాను. కృష్ణ అదృష్ట వంతుడు గనుక పుణ్యశాలివైన నీ కడుపున పుట్టాడు. నా తమ్ముడి అదృష్టం అంతా."

అంటూ విరక్తిగా నవ్వాడు.

ఇంటికి తిరిగి వచ్చేదారి పొడవునా రామారావూ, సరస్వతీ మౌనంగానే వున్నారు.

"ఏమిటాలోచిస్తున్నావు సరస్వతీ ?"

"ఇంకేముందీ ? జీవితం గురించే."

"అందే ? ఎవరి జీవితం గురించి ?"

"జీవితం ఎవరిదైనా కానీండి. అది సవ్యంగా సాగాలంటే ఏమిటి అవసరమంటారు ?"

"నువ్వే చెప్పు ? నాకు మాత్రం నా జీవితానికి చుక్కానివి నీవే నన్పిస్తుంది. ఆస్తులూ అంతస్తులూ వున్న ఒక్కొక్కళ్ళ జీవితంలోని అగాధాలూ చూస్తూన్నాం. ఆ ఆస్తులూ ఐశ్వర్యాలూ లేకున్నా మనం సుఖంగానే వున్నామంటే అది నీ చలవే"

"పొగడ్తలు వద్దు, నా ఒక్కతె మీదా ఆధారపడి లేదు, మన ఇద్దరిపైనా ఆధారపడి వున్నాయంటి అన్నీ, మన మధ్య సదవగాహన వుంది, జీవితాన్ని ఒక పథకంలో నడిపించుకున్నాం. ఇద్దరం స్నేహితులలాగా నడచుకున్నాం, ఫలితమే ఈనాటి ఈసుఖం ఇద్దరమూ అత్యాశలకు పోలేదు."

"నిజం సరస్వతీ."

"అందుకే నేనొక నిర్ణయానికొచ్చానండి."

"ఏమిటి !"

"కృష్ణ మన చెప్పు చేతాలలో పెరిగిన బుద్ధిమంతుడు, మంచీచెడూ అన్నీ తెలుసు. కృష్ణ ఇష్టపడ్తూన్న అమ్మాయి బుద్ధి మంతురాలే అయివుంటుంది. అందుకే వాడికిగానీ యిష్టమైతే మనం ఏ విషయంలోనూ ఏమీ షరతులుగానీ, అనంగీకారాలుగానీ వెలి బుచ్చి ఆటంకాలు తేవద్దు. కృష్ణయిష్టప్రకారం వివాహం నిర్ణయించు దాం, భర్తనూ, సంసారాన్నీ, బిడ్డలనూ, ఇంటినీ నావకు చుక్కానిలాగా స్త్రీతానే అయి నడపగలగాలి, మన ఇంటికి వచ్చేవధువులకు ఆ సుగుణాలు వుంటే చాలు, డబ్బుప్రధానం కాదు."

రామారావు ఆనంద విస్ఫారిత నేత్రాలతో తదేకంగా కొన్ని క్షణాలు చూచాడు భార్యను.

"నేడు నీపై నాకుగల గౌరవం మరింత పెరిగింది సరస్వతీ అన్నయ్య చెప్పినట్లు నీవు నా జీవితచుక్కానివి కావడం నా అదృష్టం."


*With best compliments From*

# SRI RAJSHRI PICTURES

*7-2-212/13, GHASMANDI*

*SECUNDERABAD - 500 361.*

*Releasing very shortly,*

*Sanjay Khan's*

# 'KALA DHANDA GORE LOG'

** ing : Sanjay Khan, Sunil Dutt, Amrita Singh.*

*Dharma Productions'*

# MUQADDAR KA FAISLA

*Directed By :*

# PRAKASH MEHRA

** ing : Raaj Kumar, Rakhee. Raj Babbar, Meenakshi Sheshadri.*